






ఓర్వకల్లులో విమానాశ్రయం నిర్మించాలన్న ఆలోచనకు 2017లోనే చంద్రబాబు రెక్కలు తొడిగారు. 19 నెలల్లోనే పూర్తి చేసి 2019 జనవరి 8న జాతికి అంకితం చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఇదీ ..అభివృద్ధి అంటే' అని నిరూపించారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ గెలిచి జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అప్పటికే పనులన్నీ పూర్తయిన విమానాశ్రయానికి పైపై మెరుగులు దిద్ది పునాదుల నుంచి తామే నిర్మించినట్లు కలరింగ్ ఇచ్చారు. దీంతో 'ఇది కదా అభివృద్ధి' అంటూ అనుకూల పత్రిక పొగడ్తలతో ముంచెత్తింది. ఇది చూసిన జనాలు ముక్కున వేలేసున్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని తమదిగా చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆనాడే విచ్చుకున్న రెక్కలు



2019 జనవరి 8వ తేదీన సీఎం హోదాలో విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు... చిత్రంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత వైసీపీ నాయకుడు ఎస్వీ మోహహన్ రెడ్డిని చూడవచ్చు

- 1,010 ఎకరాల్లో కర్నూలు విమానాశ్రయం
- 2017 జూన్ 21న శంకుస్థాపన చేసిన చంద్రబాబు
- కొండలు పిండి చేసి ఎయిర్‌పోర్టు నిర్మాణం
- 2019 జనవరి 8న జాతికి అంకితం
- 19 నెలల్లో విమానాశ్రయ నిర్మాణం.. ట్రైయల్ రన్ విజయవంతం
- ఎన్నికలకు ముందు అదే ఎయిర్‌పోర్టులో దిగిన వైఎస్ జగన్
- రంగులు వేసి.. మెరుగులు దిద్ది 'ఇది కదా అభివృద్ధి' అంటూ తప్పుడు రాతలు

కర్నూలు, జవనరి 20 (ఆంధ్రజ్యోతి)

రాయలసీమ జిల్లాలు కడప, అనంతపురం, చిత్తూరులో విమానాశ్రయాలు ఉంటే.. కర్నూలులో ఒక్కటీ లేదు. దీంతో ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ హబ్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి, ఐరన్, సిమెంట్.. వంటి పరిశ్రమలు రావాలంటే.. పారిశ్రామికవేత్తలు రాకపోకలకు అనువుగా విమానాశ్రయం నిర్మించాలని ఆనాటి సీఎం నారా చంద్రబాబు నాయుడు తలచారు. కేంద్ర విమానయాన శాఖ అధికారులను ఒప్పించారు. ఓర్వకల్లు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణ బాధ్యతలు ఏపీ విమానాశ్రయ అభివృద్ధి సంస్థ (ఏపీ ఎయిర్‌పోర్ట్స్)కు అప్పగించి.. ఓర్వకల్లు సమీపంలో 1,010 ఎకరాలు కేటాయించారు. రూ.110 కోట్లు నిధులు మంజూరు చేశారు. 2017 జూన్ 21న ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అప్పటి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. ఆనాటి బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి చెందిన నిర్మాణ సంస్థ జేఆర్‌సీ-కేసీవీఆర్ జాయింట్ వెంచర్‌గా పనులు చేపట్టింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ చరిత్రలోనే 19 నెలల్లో కొండలు.. బండరాళ్లు పిండి చేసి విమానాశ్రయం నిర్మించింది. 2018 డిసెంబరు 31న ట్రయల్ రన్ విజయవంతమైంది. అదే రోజు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరిన విమానం (ఫ్లైట్) ఓర్వకల్లు విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. 2019 జనవరి 8న నాటి సీఎం చంద్రబాబు ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

మార్చి 21, 2019న రన్‌వేపై ట్రయల్ రన్



2019 జనవరి 8వ తేదీన ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో ఎంవోయూ





ప్రారంభోత్సవ శిలాఫలకం

టీడీపీ ప్రభుత్వంలోనే 90 శాతం పనులు..

కొండ రాళ్లను చదును చేసి ఎయిర్‌పోర్ట్‌లో కీలకమైన రన్‌వే, ఆప్రాన్, టెర్మినల్, టవర్ భవనం, రన్‌వే చుట్టూ 9.4 కి.మీలు ప్రహరీ, రన్‌వే చుట్టూ 5.30 కి.మీలు పెరిఫెరల్ రోడ్డు నిర్మించారు. కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టు చేరుకోవడానికి వీలుగా 2.4 కి.మీలు అప్రోచ్ రోడ్డు, ప్రయాణికులు, వివిధ వాహనాల రాకపోకలకు వీలుగా 1.7 కి.మీ. పొడవుతో మరో నాలుగు ఇంటర్నల్ రోడ్లు, 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్ (పీటీబీ), టెర్మినల్‌కు ఎదురుగా (రన్‌వే వైపు) 80-85 మంది ప్రయాణించే ఏటీఆర్-760 విమానాలు నాలుగు ఒకేసారి పార్కింగ్ చేసేందుకు ఆప్రాన్ నిర్మించారు. పీటీబీకి బయట వైపు ప్రయాణికులు, కనువిందు చేసేలా సువిశాల ఉద్యానవనం (పార్కు) అభివృద్ధి చేశారు. అంటే 90 శాతం పనులు టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేసి దాదాపు రూ.120 కోట్లకు పైగా ఖర్చు చేశారు. తొలి విడతగా 2019 ఏప్రిల్, మే నుంచి కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి గన్నవరం, హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రాయలకు డొమెస్టిక్ విమానాలు నడిపాలని, రెండో విడతలో బెంగళూరు, చెన్నైకి ఫ్లైట్ సర్వీసులు ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు. సిగ్నల్ వ్యవస్థ పూర్తి చేయాల్సి ఉంటే దానికీ రూ.50 కోట్లు చంద్రబాబు ప్రభుత్వం మంజూరు చేసింది.



ట్రయల్ రన్ విమానం నుంచి దిగుతున్న చంద్రబాబు నాయుడు



2019 జనవరి నెలలో జరిగిన ట్రయల్ రన్‌ను వీక్షిస్తున్న స్థానికులు

డబ్బా కొట్టుకుంటూ మభ్యపెట్టే యత్నం

టీడీపీ ప్రభుత్వంలో భూ సేకరణ తదితర పనుల్లోనే 2018 వరకు కాలయాపన చేశారని, 2.2 కి.మీ. రన్‌వే మాత్రమే నిర్మించారని, 2019 మేలో సీఎం జగన్ వచ్చాకే ఓర్వకల్లు విమానాశ్రయం పూర్తి చేసినట్లు 'ఇది కదా అభివృద్ధి' అంటూ సొంత పత్రికలో డబ్బా కొట్టుకున్నారు. జగన్ వచ్చాక చేసింది పది శాతం పనులే. ప్యాసింజర్ టెర్మినల్‌కు ఎదురుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసి విమానాశ్రయాన్ని తామే నిర్మించినట్లు రాసి జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఈ కథనాన్ని చదిని జనం ఇదెక్కడి చోద్యం అంటూ అవాక్కవుతున్నారు. ఆ పత్రిక రాతలే నిజమైతే ఎన్నికల ముందు జగన్ జిల్లాలో ప్రచారానికి ప్రత్యేక విమానంలో వచ్చినప్పుడు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఎలా దిగారని ప్రశ్నిస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విమానాల రాకపోకలకు రెండేళ్లు ఆలస్యమైంది. మళ్లీ టీడీపీ ప్రభుత్వమే వచ్చి ఉంటే 2019 మే నెలలోనే విమానాల రాకపోకలు సాగేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విమానాల రాకపోకలు సాగిస్తే ఆ క్రెడిట్ చంద్రబాబుకు వెళ్తుందన్న దురుద్దేశంతో 2021 మార్చి వరకు జాప్యం చేసి తర్వాత రన్‌వేపై విమానం దింపి ఎయిర్‌పోర్ట్ మొత్తం తామే నిర్మించినట్లు కలరింగ్ ఇచ్చుకోవడం చూసి జనాలు నవ్వుకుంటున్నారు.



ఆ ఘనత చంద్రబాబుదే..

మా ఊరు ఓర్వకల్లు పక్కనే 2017 జూన్‌లో విమానాశ్రయం నిర్మాణానికి ఆనాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మా కళ్ల ముందే ఏడాదిన్నరలోగా పనులు పూర్తి చేసి చంద్రబాబే ప్రారంభించారు. ఆ రోజు విమానాశ్రయానికి మేము కూడా వెళ్లాం. ముమ్మాటికి ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. మళ్లీ చంద్రబాబు వచ్చి ఉంటే ఓర్వకల్లు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించేంది. జగన్ వచ్చాక ఒక్క పరిశ్రమ కూడా రాలేదు.

- గోవిందరెడ్డి, రైతు, ఓర్వకల్లు



ఇది సాధ్యమా అనుకున్నాం

ఓర్వకల్లుకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందంటే అది చంద్రబాబు వల్లనే. మా ఊరి పక్కనే కొండ రాళ్ల మధ్య విమానాశ్రయం నిర్మిస్తామని ఆనాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తే ఈ రాళ్లలో సాధ్యమయ్యే పనేనా అనుకున్నాం. రెండేళ్లలోపే పనులు పూర్తి చేసి విమానాన్ని కూడా రన్‌వేపై దింపారు. ఆ రోజు మా ఊరు జనమంతా వెళ్లి చూశాం. పనులన్నీ టీడీపీ ప్రభుత్వంలోనే అయిపోయాయి. జగన్ వచ్చాక రెండోసారి ప్రారంభం అంటే నవ్వుకున్నాం.

- జీసీ అల్లాబాబు, ఓర్వకల్లు



మళ్లీ టీడీపీ వచ్చి ఉంటే

గత టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు ఓర్వకల్లులో విమానాశ్రయం నిర్మించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన విమానం కూడా దిగింది. ఎయిర్‌పోర్టు ఒక్కటే కాదు.. ఓర్వకల్లుకు ఆసియాలోనే అతిపెద్ద వెయ్యి మెగావాట్లా సోలార్ పవర్ యూనిట్, జైరాజ్ ఇస్పాత్ పరిశ్రమ. డీఆర్‌డీవో వంటివి తీసుకొచ్చారు. ఉర్దూ యూనివర్సిటీ కూడా ఇక్కడే కట్టారు. జగన్ వచ్చాక ఉర్దూ యూనివర్సిటీకి ఒక్క రాయి కూడా వేయలేదు. విమానాశ్రయం కట్టామంటే ఎలా నమ్మాలి.

- సుభాన్, భవన నిర్మాణ కార్మికుడు, ఓర్వకల్లు



కొచ్చెర్వులో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


బీసీలను దగా చేసిన జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

డోన్, జనవరి 20: సీఎం జగన్ మోసపు మాటలు చెప్పి బీసీల వెన్ను విరిచి దగా చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం డోన్ మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమానికి మల్లెల రాజశేఖర్‌తోపాటు సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వర రావు యాదవ్, వలసల రామకృష్ణ, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కాటమయ్య, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మురళీకృష్ణగౌడు హాజరయ్యారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో బీసీలను పూర్తిగా అణగదొక్కారని ధ్వజమెత్తారు. ఎలాంటి అధికారాలు, నిధులు లేకుండా బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధుల్లో రూ.75వేల కోట్లు దారి మళ్లించి అన్యాయం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా సంక్షేమ పథకాలకు అదనంగా బీసీ సబ్ ప్లాన్ ద్వారా రూ.36,475 కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. బీసీల రక్షణ కోసం చంద్రబాబు ప్రత్యేక చట్టం తీసుకువచ్చేందుకు మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని అన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో 30కి పైగా బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలు రద్దు చేశారని ధ్వజమెత్తారు. బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు 75వేలకు పైగా భర్తీ చేయకుండా వైసీపీ ప్రభుత్వం బీసీ యువతకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, మిద్దెపల్లి గోవిందు, మధుసూదన్ రెడ్డి, కొచ్చెర్వు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాఘవరాముడు

- మంత్రాలయంలో 59 అడుగుల ఏకశిలా విగ్రహం
- దక్షిణ అయోధ్యగా గుర్తింపు తీసుకొస్తాం
- మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



శ్రీరాముని ఏకశిలా విగ్రహం ఏర్పాటు చేయిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 20: మంత్రాలయం రాఘవరాయడి చెంతన భారీ 59 అడుగుల శ్రీరాముని ఏకశిల విగ్రహ ఏర్పాట్లు పూర్తి స్థాయికి చేరాయి. శనివారం భారీ క్రేన్లతో ముందుగా తయారు చేయించిన శ్రీరాముని విగ్రహాన్ని పీఠంపై నిలబెట్టారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేసి శ్రీరాముని ఏకశిల విగ్రహాన్ని భారీ క్రేన్ల సాయంతో ఏర్పాటు చేయించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మంత్రాలయంలోనూ ఏకశిల శ్రీరామున్ని ప్రతిష్ఠించాలని ధ్యేయంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. దక్షిణ అయోధ్యగా మంత్రాలయాన్ని తీర్చిదిద్దడం ప్రయత్నాలు చేస్తున్నట్లు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చెప్పారు. 2022 జూన్ 15వ తేదీ నుంచి అనంతపురం జిల్లా నుంచి భారీవాహనంపై 15 అడుగుల వెడల్పుతో 270 టన్నుల బరువు గల ఏకశిలను తీసుకువచ్చారు. అభయ శ్రీరామ ట్రస్టు అధ్యక్షులు బెంగుళూరు చెందిన క్రిష్ణమూర్తి, కార్యదర్శి హైదరాబాదుకు చెందిన ద్వారకానాథ్, కోశాధికారి బెంగుళూరు చెందిన హరీష్, మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం సంయుక్తంగా భారీ విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మాధవరం రోడ్డులో అభయాంజనేయస్వామి ఎదురుగా పదెకరాల్లో రూ.10 కోట్లతో 270 టన్నుల బరువు, 15 అడుగుల వెడల్పుతో 45 అడుగుల ఎత్తు గల ఏకశిల శ్రీరాముని విగ్రహాన్ని నెలకొల్పారు. ప్రముఖ శిల్పి అశోక్ గుడిధార్ ఇంజనీర్ అభిషేక్ గుడిధార్, సుబ్రహ్మణ్య గుడిధార్ ఆధ్వర్యంలో కర్ణాటక, ఆంధ్రకు చెందిన 20 మంది శిల్పికళాకారులు 2022 నుంచి 2024 వరకు ఏకశిల విగ్రహాన్ని చెక్కారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ తదితరులు పాల్గొన్నారు.

'రా..కదలిరా' వాయిదా

27 లేదా 28 తేదీల్లో నిర్వహించే అవకాశాలు

పత్తికొండ, జనవరి 20: ఈనెల 25న పత్తికొండలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన 'రా..కదిలిరా' కార్యక్రమం వాయిదా పడింది. 22వతేదీ అయోధ్యలో జరిగే రామమందిరం ప్రారంభోత్సవానికి చంద్రబాబునాయుడు వెళ్తున్నారు. దీంతో అయోధ్య నుంచి తిరిగి వచ్చిన వెంటనే పత్తికొండలో నిర్వహించాల్సిన 'రా..కదిలిరా' కార్యక్రమంలో పాల్గొనడం కష్టతరం కావడంతో కార్యక్రమం వాయిదా పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 27 లేక 28 తేదీల్లో బహిరంగసభ జరిగే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

జగన్ పని అయిపోయింది

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి



వెంకటాపురంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 20: రాష్ట్రంలో జగన్ పని ఇక అయిపోయిందని బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ బిల్లులను ఎడాపెడా పెంచేసిన వైసీపీ ప్రభుత్వం పేదల నడ్డి విరిచిందన్నారు. శనివారం సాయంత్రం బనగానపల్లె మండలంలోని వెంకటాపురం, పండ్లాపురం గ్రామాల్లో 'బాబుష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ'పై బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన అన్యాయంపై ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇప్పటికి తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఉద్యోగాల కల్పనలో అసమర్థ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం జగన్ అవినీతి పాలనను చూసి పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వరరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గడ్డం చెన్నారెడ్డి, రామసుబ్బారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, చల్లా నారాయణ, కుమ్మరి రామకృష్ణ, గడ్డం సురేంద్ర, పండ్లాపురం నాయకులు శ్రీరాములు, రామ్మోహన్, శంకర్‌రెడ్డి, జనసేన దూదేకుల ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు పురపాలక సంఘము
వేలము నోటీసు
నందికొట్కూరు పురపాలక సంఘమునకు సంబంధించిన 1 షాపు రూమును దివ్యాంగుల కోటా క్రింద కేటాయించబడినది. పట్టణము నందు ఆసక్తి గల దివ్యాంగులు తేదీ : 27-01-2024న ఉదయం 11.00 గంటలకు జై కిసాన్ పార్కు నందు నిర్వహించు వేలము నందు పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది. మిగిలిన వివరములకు రెవెన్యూ విభాగము నందు ఆఫీసు పని వేళల యందు తెలుసుకొనవచ్చును.
సం/- పి.కిషోర్, కమిషనరు, నందికొట్కూరు పురపాలక సంఘము



అద్భుత ఘట్టంలో ఆయనది చెరగని ముద్ర

అయోధ్య రామ మందిర నిర్మాణంలో కీలక పాత్ర : అయోధ్య రామ మందిరం ఉద్యమానికి ఊపిరి ఊదిన నాయకుల్లో చాలా మంది కాలధర్మం చేసినప్పటికీ వారు అందించిన స్ఫూర్తి, సహకారం మాత్రం మరువలేనిది. రామ కార్యాన్ని పూర్తి చేయడంలో వారు సేవలు ఎనలేనివని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రత్యేకించి అయోధ్య రామమందిర వివాదం 500 ఏళ్ల నుంచి కొనసాగుతున్నప్పటికీ 1990 నుంచి తీవ్ర స్థాయికి చేరుకుంది. 1990 అక్టోబరు 30న జరిగిన మొదటి కరసేవలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంలో పుల్లారెడ్డి కీలకంగా వ్యవహరించారు. ఆ తర్వాత 1992 డిసెంబరు 6వ తేదీన జరిగిన రెండో కరసేవలో అగ్రనాయకులతో కలిసి పుల్లారెడ్డి శ్రీరామ జన్మభూమి వేదికపై ఉన్నారు. అప్పటివరకు ఉధృతంగా సాగిన అయోధ్య రామ మందిరం వివాదాన్ని ఒక్కసారిగా కోర్టు కేసులు చుట్టుముట్టాయి. రామాలయ నిర్మాణం అంశం కోర్టు పరిధిలోకి వెళ్లిపోయింది. అయితే అప్పటికే విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కోశాధికారిగా కొనసాగుతున్న పుల్లారెడ్డి సాధ్యమైనంత వరకు తోడ్పాటునందించారు. న్యాయ పోరాటానికి అవసరమైన కోర్టు ఖర్చులను భరించేందుకు ముందుకొచ్చారు. తనకు ఉన్న పరిచయాలతో ఉద్యమానికి అవసరమైన నిధి సేకరణకు కంకణబద్ధులై పని చేశారు.

- అయోధ్య రామమందిర నిర్మాణంలో విశేష కృషి చేసిన పుల్లారెడ్డి
- ఉద్యమానికి వెన్నంటి ఉంటూ ఆర్థిక చేయూత
- న్యాయ పోరాటానికి సొంతిల్లు, నగలు అమ్మేందుకు వెనకాడని వైనం
- విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కోశాధికారిగా సేవలు
- నేతి మిఠాయిల వ్యాపారంతో ప్రపంచ ఖ్యాతి
- స్వగ్రామానికి అన్ని విధాలుగా తోడ్పాటు



ఆత్మకూరు, జనవరి 20:

ఐదు శతాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. అనేక వివాదాల నడుమ శ్రీరామ జన్మభూమి అయోధ్యలో రామ మందిర నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. మరికొన్ని గంటల్లో అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ క్రతువు జరగనుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అంబరాన్ని అంటేలా సంబరాలు జరుగుతున్నాయి. ఇంతటి అద్భుత ఘట్టంలో ఎంతో మంది త్యాగధనుల కృషి ఉంది. అందులో నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గోకవరం గ్రామ వాసి, ప్రముఖ మిఠాయిల వ్యాపారవేత్త దివంగత జీ పుల్లారెడ్డి ఒకరు. అందులో ఆయన పాత్ర విశేషంగా చెప్పవచ్చు. 22వ తేదీన అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహం ప్రతిష్ఠ సందర్భంగా పుల్లారెడ్డి గురించి ఆంధ్రజ్యోతి కథనం..

మారుమూల ప్రాంతంలో పుట్టి..

1920 ఆగస్టు 20వ తేదీన గుణంపల్లి హుసేన్‌రెడ్డి, పుల్లమ్మల దంపతులకు పుల్లారెడ్డి జన్మించారు. నిరుపేద వ్యవసాయ కుటుంబం కావడంతో కూలినాలీ చేసుకుంటూ జీవనం సాగించేవారు. మొదట్లో పుల్లారెడ్డి మజ్జిగ, బట్టలు, టీ అమ్మడం వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేశారు. తన చిన్నాన్న కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రోద్బలంతో 1948లో మిఠాయి వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఈయన తయారు చేసే మిఠాయిలకు మంచిపేరు రావడంతో 1957లో హైద్రాబాద్‌లోని అబిడ్స్‌లో చిన్న మిఠాయిల దుకాణాన్ని ప్రారంభించారు. ఆ తరువాత అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచారు. అంతేగాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జీ పుల్లారెడ్డి మిఠాయిల దుకాణాలను ఏర్పాటు చేసి తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. పలు సందర్భాల్లో హైద్రాబాద్‌కు వచ్చిన విదేశీయులు సైతం ఈయన తయారు చేసిన మిఠాయిల రుచి చూసి ఎంతో ప్రశంసించేవారు. ఇదిలావుంటే తన మిఠాయి దుకాణాల్లో పని చేసే కూలీలను కూడా సొంతింటి మనుషులుగా భావించేవారు. వారందరికీ ఆయన సొంత ఇళ్లను కూడా నిర్మించి సహాయ సహకారాలు అందించిన మంచి మనస్సు గల వ్యక్తిగా పేరు గడించారు.

రామాలయ నిర్మాణం కోసం ఇంటిని అమ్మేందుకు సిద్ధం

అయోధ్య రామ మందిరానికి సంబంధించి ఒకసారి కోర్టు ఖర్చుల నిమిత్తం విశ్వహిందూ పరిషత్ ఢిల్లీ శాఖకు రూ.25 లక్షలు అవసరం ఏర్పడింది. ఆ పరిస్థితుల్లో నిధులను సమీకరించడం కష్టతరం కావడంతో అప్పటి విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ హైదరాబాద్‌కు చేరుకుని జీ పుల్లారెడ్డి ఇంటికి వచ్చి సంప్రదించారు. నిధుల సమీకరణ విషయంపై వారితో ప్రస్తావించారు. వెంటనే రూ.2 లక్షల తీసుకొచ్చి అశోక్‌జీ చేతిలో పెట్టారు. సాయంత్రానికి మరో రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి ఆ మొత్తాన్ని కూడా సమకూర్చారు. మిగిలిన డబ్బును తన మిత్రుల నుంచి సమకూరుస్తానని భరోసా ఇచ్చారు. రామ జన్మభూమి వివాదం విజయం సాధించే వరకు న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తన ఇంటిని, ఇంట్లో నగలను అమ్మైనా కోర్టు ఖర్చులు ఇస్తానని అన్నారు. ఈయన దాతృత్వానికి ఆయన సతీమణి సైతం అడ్డు చెప్పేవారు కాదు. ఈ విషయాలను పుల్లారెడ్డి మరణాంతరం హైద్రాబాద్‌లో నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో అశోక్ సింఘాల్ స్వయంగా వెల్లడించారు. అయితే 2019 నవంబరు 9న సుప్రీంకోర్టు మందిర నిర్మాణానికి అనుగుణంగా తీర్పు ఇచ్చింది. ఆ సమయానికి పుల్లారెడ్డి లేకపోయినప్పటికీ ఆయన ఆత్మ శాంతిస్తుందని వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



జీ.పుల్లారెడ్డి నిర్మించిన ఆసుపత్రి

సంఘ్ పరివార్ సంస్థలకు పెద్ద దిక్కుగా..

విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ స్థాయి బాధ్యతలు చేపడుతూనే సంఘ్ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యానికి జీ పుల్లారెడ్డి పెద్దదిక్కుగా నిలిచేవారు. 1974లో సంఘ్‌చాలక్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఏటా జరిగే సంఘ్ శిక్షణా తరగతులు, ఏబీవీపీ అభ్యసన తరగతులు, భజరంగదళ్ శిక్షణా శిబిరాలు, సేవా భారతి, స్వదేశీ జాగరణ సమావేశాలు, బీఎంఎస్ సభలు, సర్వసతీ శిశు మందిర్ ఉపాధ్యాయుల శిక్షణా సమయాల్లో ఆయా శిబిరాలను సందర్శించేవారు. స్వయం సేవలకు స్వయంగా నేతి మిఠాయిలు పంచేవారు. ఈ క్రమంలోనే ఈయనను కిడ్నాప్ చేయాలని కొందరు కుట్ర పన్ని నప్పటికీ ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టి ఆయనకు భద్రత కల్పించాయి. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖకు అన్నీ తానై వ్యవహరించేవారు. హైద్రాబాద్‌లోని కోటిలో విశ్వహిందూ పరిషత్‌కు సొంత భవనాన్ని నిర్మించడంతోపాటు అబిడ్స్‌లో ఇస్కాన్ ఆలయానికి స్థల దాతగా నిలిచారు. అంతేగాకుండా సంస్కృత భాషా ప్రచార సమితి అధ్యక్షుడిగా, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితికి అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పని చేశారు. విద్యాసంస్థలను స్థాపించి తనకంటూ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. అలాగే నిరుపేదల విద్యార్థులను ఎంపిక చేసి తన విద్యా సంస్థల్లో ఉచిత విద్యతోపాటు వసతి, భోజన సదుపాయాన్ని కల్పించారు. ఈయన దాతృత్వాన్ని గుర్తిస్తూ ఉడిపి పెజావర్ స్వామివారు జీ పుల్లారెడ్డిని దానగుణ భూషణ అనే బిరుదుతో సత్కరించారు. 1992లో ఈయన జమ్నా లాల్ బజాజ్ అవార్డు పొందారు. 2007 మే 9వ తేదీన మరణించారు. అయితే ఏనాడు జీ పుల్లారెడ్డి తాను ఆర్జించిన ధనంపై మోహం చూపలేదు. సంపాదించిన దాంట్లో సమాజానికి ఇవ్వాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగారు. ఈయన పెద్దకుమారుడు రాఘవరెడ్డి విశ్వహిందూ పరిషత్‌కు 2011-18 వరకు అంతర్జాతీయ అధ్యక్షుడిగా పని చేశారు.

స్వగ్రామానికి అన్ని విధాలుగా తోడ్పాటు

తాను ఎంత ఎత్తుకు ఎదిగినప్పటికీ జన్మభూమిని మరవని మహోన్నత వ్యక్తి పుల్లారెడ్డి. తన ఆశయాలు కొనసాగాలన్న గొప్ప సంకల్పంతో విస్తృతంగా శాశ్వత సేవా కార్యక్రమాలు చేపట్టారు. జీ పుల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ పేరిట తన సతీమణి గుణంపల్లి నారాయణమ్మ జ్ఞాపకార్థం గోకవరం గ్రామంలో 1996లో మూడు ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చి 24 గంటల పది పడకల ఆసుపత్రిని నిర్మించారు. ఈ వైద్యశాలలో రూ.10కే ఉచితంగా వైద్యసేవలు, మందులు పంపిణీ చేస్తున్నారు. గ్రామంలోని పంట పొలాలకు సాగు నీరందించాలన్న సంకల్పంతో 530 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఎద్దులేరు వాగుపై చెరువు నిర్మాణానికి ప్రోత్సాహం అందించారు. దీంతో వేలాది ఎకరాల పంట భూములు సస్యశ్యామలం అయ్యాయి. అదేవిధంగా గ్రామంలో సేవా భారతి ఫౌండేషన్ ద్వారా కొనసాగుతున్న భక్త కన్నప్ప గిరిజన ఆశ్రమ పాఠశాలకు మూడు ఎకరాల స్థలంతోపాటు రూ.15 లక్షల వ్యయంతో భవన నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ పాఠశాలలోనే చెంచుగిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 4.70 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇవ్వడంతోపాటు పాఠశాల భవన నిర్మాణానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా విద్యుత్‌స్టేషన్ ఏర్పాటుకు ఎకరా, గ్రామంలో శివాలయం కోసం ఎకరా, గ్రామంలో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటుకు రెండున్న ఎకరాల స్థలాన్ని విరాళంగా అందించారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటుకు 25 శాతం ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించేలా రూ.10 లక్షల వ్యయంతో చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. జీ పుల్లారెడ్డి ఇంజనీరింగ్, బీ- ఫార్మసీ కళాశాలల్లో గ్రామానికి చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించి వారు ఉన్నతికి కృషి చేశారు.

అరుదైన అదృష్టం జీ పుల్లారెడ్డిని వరించింది



దేశంలో ఎంతోమంది ధనవంతులు ఉన్నప్పటికీ శ్రీరామ జన్మభూమి అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి విశేషమైన కృషి చేసే గొప్ప అదృష్టం జీ పుల్లారెడ్డికి వరించడం మామూలు విషయం కాదు. అట్టడగు స్థాయి నుంచి ఎంతో కష్టపడి ఎదిగి తనవంతుగా రామకార్యంలో అత్యంత కీలకపాత్ర వహించిన జీ పుల్లారెడ్డి ఆత్మకూరు ప్రాంతవాసి కావడంతో మాకందరికీ గర్వకారణం. సేవా కార్యక్రమాల్లో ఆయన ఎంతో స్ఫూర్తి అందించారు. సంపాదించిన సొమ్ములో సమాజానికి ఎంతో కొంత ఖర్చు చేసిన గొప్ప వ్యక్తి. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆయన్ని స్మరించుకోవడం అందరి బాధ్యత.

గరుడాద్రి సత్యనారాయణశర్మ, పట్టణ పురోహితుడు, ఆత్మకూరు.

పుల్లారెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగుతాం



అయోధ్య రామమందిరం నిర్మాణంలో చెరగని ముద్ర సొంతం చేసుకున్న జీ పుల్లారెడ్డి స్ఫూర్తితో మేము ముందుకు సాగుతాం. అవసరమైతే రామ మందిరం కోసం సొంతింటిని సైతం అమ్మాలన్న జీ పుల్లారెడ్డి సంకల్పమే నేడు ఇంతటి విజయానికి సోపానంగా నిలిచింది. ఈ మహాకార్యంలో ఆయన లేకపోవడం బాధాకరమే. అయోధ్య రామాలయ నిర్మాణానికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మేము మరువలేదు. పుల్లారెడ్డి స్ఫూర్తితో హిందూ ధార్మిక కార్యక్రమాల్లో ముందుండి పని చేస్తామని సగర్వంగా తెలియజేస్తున్నాం.

- శివరామకృష్ణ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రతినిధి, ఆత్మకూరు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 20: జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష కర్నూలు నగరంలో శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 3693 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నగరంలోని ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల, ఇందిరాగాంధీ హైస్కూల్, ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పారా లీగల్ వలంటీర్లకు న్యాయ సదస్సు

కర్నూలు(లీగల్), జనవరి 20: పారా లీగల్ వలంటీర్లు వివిధ చట్టాలపై అవగాహన పెంచుకుని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు కోరారు. న్యాయ సేవాసదన్ భవన్‌లో శనివారం జరిగిన పారా లీగల్ వలంటీర్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు వినియోగదారుల హక్కుల చట్టం, క్రిమినల్ చట్టాలు, సివిల్ చట్టాలతో పాటు ప్రాథమిక హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. యువకుడి మృతి

మంత్రాలయం, జనవరి 20: మండలంలోని మాధవరం సమీపంలో సెయింట్ మార్థోమా స్కూల్ దగ్గర బైక్ బోల్తా పడి శనివారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. మాధవరం గ్రామానికి చెందిన బోయ విశ్వనాథ్ (25) మోటారు సైకిల్‌పై రాంపురం నుంచి సొంత గ్రామానికి వస్తుండగా అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ కిరణ్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య పద్మ, కొడుకు అఖిల్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొలేరో డివైడర్‌ను ఢీకొని..

కర్నూలు, జనవరి 20: నగరంలోని బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో అస్లాం (22) అనే యువకుడు మృతి చెందాడు. కర్ణాటకకు చెందిన అస్లాం అతని మిత్రులు పవన్ కుమార్‌తో కలిసి కొబ్బెర వ్యాపారం చేస్తుంటారు. బెంగళూరు సమీపంలో ఉన్న తుంకూరు జిల్లాకు చెందిన వీరిద్దరు తమ సొంత బొలేరో వాహనంలో కొబ్బెరతో హైదరాబాదుకు బయలుదేరారు. కర్నూలు వచ్చిన తర్వాత వీరు ప్రయాణిస్తున్న బొలేరో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న అస్లాం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఏడాది కొడుకు ఉన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యా.. ఆత్మహత్యా..?

- అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి
- పాండురంగాపురం సమీపంలోని వైసీపీ ప్రజాప్రతినిధి వెంచర్‌లో ఘటన

నంద్యాల క్రైం, జనవరి 20 : నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామం సమీపంలోని అధికార పార్టీ ప్రజా ప్రతినిధి వెంచర్‌లో ఓ బాలిక మృతి చెందింది. బాలికను అత్యాచారం చేసి ఆపై హత్య చేసి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన యాకోబు, కర్ణ దంపతులు తమ కుమార్తెతో, మరి కొంత మందితో పాండురంగాపురం సమీపంలోని వెంచర్‌లో కూలీపని చేసేందుకు వలస వచ్చారు. పండుగకు బాలిక తల్లిదండ్రులు ఊరికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా బాలిక ఉంటుంది. శుక్రవారం ఉదయం తెలిసిన వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి ఆరుగురు కూలీలకు భోజనం సిద్ధం చేయాలని చెప్పి వెళ్లారు. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బాలిక ఇంట్లో విగత జీవిగా ఉండటం స్థానికులు గుర్తించారు. ఈ సమాచారంతో మృతురాలి తల్లి దండ్రులు నంద్యాలకు చేరుకున్నారు. బాలిక మృతి అనుమానాస్పదంగా ఉండటంతో విషయాన్ని బయటకు పొక్కకుండా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రి మార్చురీ గదికి తరలించారు. ఘటనపై తల్లిదండ్రులను వివరణ కోరగా.. తమకేమీ తెలియదని, అంతా రెడ్డే చూసుకుంటారని సమాధానం ఇచ్చారు. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకొని బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి నుంచి సరైన మద్దతు రాకపోవడంతో మిన్నకుండిపోయారు. అయితే దళిత సంఘాల నాయకులు బాలస్వామి, లక్ష్మణ్ మాట్లాడుతూ బాలికపై అత్యాచారం చేయడంతోనే మృతి చెందిందని, ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఉరి వేసుకున్నట్లు ఆనవాళ్లు కనిపించడంలేదని అన్నారు. ఈ సంఘటనపై తాలుకా అర్బన్ సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐ నాగరాజు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. బాలిక మృతదేహానికి పోస్టుమార్టం అయ్యేంత వరకు సీఐ, ఎస్‌ఐ పోస్టుమార్టం గది వద్దనే ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న వాల్మీకులు

కర్నూలు (కలెక్టరేట్)/కల్లూరు, జనవరి 20: ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ శనివారం వాల్మీకి యువ సేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. బీసీవైపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ వాల్మీకి బోయలకు బీసీవైపీ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని అన్నారు. అంతకముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో వినోద్, శేషు, క్రాంతి, కృష్ణుడు, రంగముని, కుబేర స్వామి, కృష్ణ పాల్గొన్నారు.

నీటిని మళ్లించిన రైతుపై చర్యలు తీసుకోండి

ఎల్లెల్సీ కార్యాలయాన్ని ముట్టడించిన రైతు సంఘం నాయకులు



ఎల్లెల్సీ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఆదోని రూరల్, జనవరి 20 : ఆదోని మండలం పెద్దతుంబళం ఎల్లెల్సీకి వచ్చే నీటిని మళ్లించుకున్న రైతుపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, లింగన్న డిమాండ్ చేశారు. శనివారం రైతులతో కలిసి ఎల్లెల్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. వారు మాట్లాడుతూ కామవరం సమీపంలోని ఫారెస్టులో పులికనుమ కాల్వ ద్వారా ఎల్లెల్సీకి నీరు ప్రవహిస్తుందని, అయితే అక్కడే ఉన్న ఓ రైతు తన అనుమతి లేకుండా కి.మీ. మేర గుంత తవ్వకొని ఎల్లెల్సీ ద్వారా ప్రవహించే నీటిని తన పొలానికి మళ్లించుకున్నాడని అన్నారు. దీంతో పెద్ద తుంబళం పొలాలకు నీరందడం లేదని తెలిపారు. తక్షణమే ఈ అక్రమ నీటి వాడకంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు జాహేర్, పీరా, మౌలా, నరసన్న, నీలకంఠ పాల్గొన్నారు.

వంద శాతం కుల గణన చేయాలి

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 20 : జిల్లాలో వంద శాతం కుల గణన సర్వే చేయాలని కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా, మండల స్పెషల్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుల గణన సర్వే 3,811 క్లస్టర్లలో సర్వే ఎందుకు ప్రారంభించలేదని అన్నారు. 13 మండలాలలో 50 శాతం కంటే తక్కువ క్లస్టర్లలో కుల గణన సర్వే చేపట్టారని మండిపడ్డారు. కుల గణన సర్వే సిబ్బంది సెలవు దినాల్లో కూడా పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, కమిషనర్ భార్గవ్ తేజ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

HOUSE FOR SALE

కొత్తగా, నాణ్యవంతంగా నిర్మించిన ఇల్లు (2BHK) అమ్మకమునకు కలదు. (తిరుమలగిరి - జోన్ రోడ్, కర్నూలు నందు.) Slab Area : 1200 Sft, 30x45 West. Contact : **63043 88820**

AJL-155668

LEASE/ RENT

Maddur Nagar Main Road, Corner 3 BHK Upstaires Renovated Available for Commercial / Residential Purpose Cell: **81214 64409.**

AJL-180086

పొలం అమ్మబడును

జోన్ మండలం, పెద్దమల్కాపురంలో 3 ఎకరాల పొలం అమ్మబడును. కావాల్సినవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : **93982 08838.**

AJL-180253

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్రః 7075656208

AJV_164648

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

CHANGE OF NAME

I, **Syed Khamrunnisa Begum** W/o. **Syed Khasim Peeran** (Old Name) R/o.27-615-1, Moolasagaram, Nandyal-518501, Nandyal Dist, AP., I Have Changed My Name Known As **Bendakayala Khamrunnisa Begum** W/o. **Syed Khasim Peeran** (New Name)

AJL-180136

CHANGE OF NAME

I, **NAIK SHERAJUDDIN** (Old Name) R/o. D.No: 90/3-70-1-1, SRINIVASA NAGAR, NEAR BALAJI NAGAR , KURNOOL of Kurnool dist, AP., hereby declare that I have changed my name as **NAIK SIRAJUDDIN** (New Name) S/o NAIK KHAJA MIAH

AJL-180136

CHANGE OF NAME

I, **NAIK MUMTAZ BEGUM** (Old Name) R/o. D.No:90/3-70-1-1, SRINIVASA NAGAR, NEAR BALAJI NAGAR , KURNOOL of Kurnool dist, AP., hereby declare that I have changed my name as **NAIK MUMTAZ** (New Name) W/o NAIK SIRAJ UDDIN

AJL-180136

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః **7382114647**

AJA- 150698

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

రోడ్డు భద్రత మాసోత్సవాలు జయప్రదం చేయాలి


బ్రోచర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, డీటీవో

నంద్యాల క్రైం, జనవరి 20 : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ శివారెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు జరిగే ఉత్సవాల బ్రోచర్లు, బ్యానర్లను శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్, జేసీ, ఎస్పీ, డీటీవోలు విడుదల చేశారు. భద్రతా ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించి ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్ స్థాయి కిసాన్ మేళా

నంద్యాల టౌన్, జనవరి 20: 'ప్రతి కూల వాతావరణ పరిస్థితులకు అనువైన పంటల యాజమాన్యం' అంశంపై అత్యల్ప వర్షపాత మండలానికి కిసాన్ మేళా ఈనెల 23న రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం, అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఎన్‌సి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కిసాన్ మేళాలో భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ, హైదరాబాదు, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోబోట్, డ్రోన్స్, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రభుత్వ, ప్రైవేటు విత్తన, పురుగు మందులు, ఎరువులు, టిష్యు కల్చర్ మొక్కలు, జీవన ఎరువుల కంపెనీలు స్టాల్స్ ప్రదర్శిస్తారని తెలిపారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లా ఏరువాక కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు ప్రసంగిస్తారన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఆత్మకూరు, జనవరి 20: ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో 12 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీ తాలుకా కార్యదర్శి టి.ప్రతాప్ అన్నారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకు హత్యలు, అత్యాచారాలు చోటుచేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. 12ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో ఆపార్టీ నాయకులు అహ్మద్‌హుసేన్, వెంకటశివుడు తదితరులు ఉన్నారు.

కేజీ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

నందికొట్కూరు, జనవరి 20: పట్టణంలోని కేజీ రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా మధ్యలో డివైడర్‌లు ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో కేజీ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించి దాదాపు ఎనిమిదేళ్లు అవుతున్నా విస్తరణ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయన్నారు. అధికారులు చొరవ తీసుకొని కేజీ రోడ్డు విస్తరణ పనులు జాప్యం చేయకుండా త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

'లెనిన్ ఆశయ సాధన కోసం కృషి చేద్దాం'

నందికొట్కూరు జనవరి 20: ప్రపంచ ప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత లెనిన్ అమరత్వం పొంది వందేళ్లు నిండుతున్న సందర్భంగా ఆయన స్ఫూర్తితో ప్రజాస్వామిక ఉద్యమాలను బలోపేతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నరసింహులు మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ పతనావస్థకు చేరిందని, సామ్రాజ్యవాద యుగంలో విప్లవోద్యమాలు పురోగమిస్తాయని పేర్కొన్నారు. లెనిన్ చేసిన సూత్రీకరణకు అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాటాలు ఉవ్వెత్తున సాగుతున్నాయన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.గోపాల్, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు తిక్కయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్న పుల్లయ్య, బాస్కర్, రామకృష్ణ, జిలాని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

బండిఆత్మకూరు, జనవరి 20: మండలంలోని ఆరు గ్రామాల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభోత్సవాలు చేశారు. శనివారం బీ కోడూరు, వెంగళరెడ్డిపేట, కడమలకాల్వ, సోమయాజులపల్లె, శింగవరం, లింగాపురం గ్రామాల్లో ఆర్బీకేలు, మురుగు కాల్వలు, సీసీరోడ్లను ప్రారంభించారు. చాలా గ్రామాల్లో ప్రజల నుంచి ఈ కార్యక్రమాలకు స్పందన కరువైంది. శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, ఎంపీటీసీ సులోచన పాల్గొన్నారు.

ఇంటింటికీ క్యాలెండర్ల పంపిణీ

నంద్యాల (కల్చరల్), జనవరి 20: నంద్యాల సమరసత ఫౌండేషన్, దాతల సహకారంతో నంద్యాలలో ఇంటింటికీ కాశాయం జెండాలు, శ్రీరాముని క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ జోనల్ ధర్మప్రచార్ ఈశ్వర్‌రెడ్డి, నంద్యాల ధర్మప్రచారక్ దాసరి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Nandyal. I issue the following notice to general public. My Clients intends to grant loan to **Jeddu Srinivasa Reddy S/o. Jeddu Narapu Reddy R/o H.No. 3-5/1, Jethaji Nagar, Atmakur Post and Mdl, Kurnool District.** by keeping the below mentioned propertie of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mort gages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Item No:1 The house site plot bearing no **1**, situated Nandyala Registration district, Atmakur Sub Registration district, in survey bearing no **226/2,** of Karivena Village, Atmakur Mdl, Kurnool dt. **Measurements :** East - West : Northern side : 50.6 feet, Southern side : 50.6 feet, North - South: Eastern side : 53.4 feet, Southern side : 55 feet Total **measurements** : 304.72 sq.yards, **BOUNDARIES: East:** Plot No 2, **West :** Tower side, **North**: Venkataswamy naik site, **South**: 33 feet Road.

Item No:II The house site plot bearing no **2** situated Nandyala Registration district, Atmakur Sub Registration district, in survey bearing no **226/2,** of Karivena Village, Atmakur Mdl, Kurnool dt. **Measurements :** East - West : 40 feet, North - South: Eastern side : 52.4 feet, Southern side : 53.4 feet **Total measurements : 235.11** Sq.yards, **Boundaries: East:** Plot No 3, **West :** Plot No 1, **North:** Venkataswamy naik site, **South:** 33 feet Road.

Item No:III The house site plot bearing no **3** situated Nandyala Registration district, Atmakur Sub Registration district, in survey bearing no **226/2,** of Karivena Village, Atmakur Mdl, Kurnool dt. **Measurements :** East - West : 40 feet, North - South: Eastern side : 51.9 feet, Southern side : 52.4 feet. **Total measurements : 231.44** Sq.yards, **Boundaries: East:** Plot No 4, **West :** Plot No 2, **North:** Chemme Lakshamma land, **South:** 33 feet Road.

Item No: IV The house site plot bearing no **7** situated Nandyala Registration district, Atmakur Sub Registration district, in survey bearing no **226/2,** of Karivena Village, Atmakur Mdl, Kurnool dt. **Measurements :** East - West : Northern side : 14.9 feet, Southern side : 31.10 feet, North - South: Eastern side : 49.5 feet, Southern side : 49.7 feet **Total measurements : 126.75** sq.yards, **Boundaries: East:** Venkata Ramana Rao land, **West :** Plot No 6, **North:** Haribabu site, **South:** 33 feet Road.

G.Madhusudhan Rao,
Advocate, Dhone. Cell: 9441733503

పురందేశ్వరి పర్యటనను విజయవంతం చేద్దాం

కొత్తపల్లి, జనవరి 20: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 21న సోమవారం నంద్యాలలో పర్యటించనున్న సందర్భంగా ఆమె పర్యటనను విజయవంతం చేద్దామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మల్లెల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఏజీ శంకర్‌గౌడులు కోరారు. శనివారం వారు కొత్తపల్లిలో మాట్లాడుతూ దగ్గుబాటి పురందేశ్వరి నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రాలు విడుదల చేస్తారని చెప్పారు. అలాగే స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో నంద్యాల పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరమ్మ, కొత్తపల్లి మండల మైనార్టీ నాయకులు జుబేర్ పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై అంగన్‌వాడీల కన్నెర్ర
- జిల్లా వ్యాప్తంగా రహదారులపై నిరసన
- 40వ రోజుకు చేరిన దీక్షలు

40 రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న పోరాటం ఉధృత రూపం దాల్చింది. శనివారం జిల్లా వ్యాప్తంగా రహదారులను నిర్బంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు అంగన్‌వాడీల ఉద్యమానికి బాసటగా నిలిచారు. 'మేం గొంతెమ్మ కోరికలు కోరలేదు.. రూ.11 వేల జీతంతో ఎలా బతకాలి? సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. 40 రోజులుగా ఆందోళన చేస్తున్నా కనీస కనికరం లేదు. ఈ ప్రభుత్వాని బుద్ధి చెప్పక తప్పదు' అంటూ అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తూర్పారబట్టారు.

– ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


పాములపాడులో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


ఆత్మకూరులో మద్దతుగా ప్రజాసంఘాల రాస్తారోకో



జూపాడుబంగ్లా, మహానందిలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

వైసీపీకి షాక్

- బుడ్డా సమక్షంలో టీడీపీలోకి నారాయణపురం వాసులు

వెలుగోడు, జనవరి 20 : బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామంలో అధికార వైసీపీ మరో షాక్ తగిలింది. నారాయణపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శనివారం మండలంలోని వేల్పనూరు గ్రామంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నివాసంలో వారు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకున్నారు. టీడీపీలోకి చేరిన వారిలో గృహసారధి కంపమల్ల వెంకటసుబ్బయ్య, 4వ వార్డు సభ్యురాలు షేక్ నబి రసూల్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఆలమూరు మురళి, వార్డు సభ్యులు బంగి శ్యామల, మాడుగుల రమేష్, పెద్దరమణతో పాటు మరో 50 కుటుంబాలు ఉన్నాయి. వీరిని బుడ్డా రాజశేఖరరెడ్డి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు.


బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన నారాయణపురం వైసీపీ నాయకులు

టీడీపీ గెలుపునకు కృషి చేద్దాం

కొత్తపల్లి, జనవరి 20: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పెద్దగుమ్మడాపురం, చిన్నగుమ్మడాపురం గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, మాజీ కన్వీనర్ జడ్.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక దళితులపై కపట ప్రేమను చూపిస్తున్నారని మండిపడ్డారు. కోడికత్తి శ్రీను ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్నా బెయిల్ మంజూరు కాకుండా జగన్ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ నాలుగున్నరేళ్ల పాలనంతా అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలతో సాగిందని, త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, బుచ్చిరెడ్డి, శివారెడ్డి, పలచాని మహేశ్వరరెడ్డి, సుబ్బరాయుడు, దర్గయ్య, ఏఎస్ రాజు, మూర్తి, హరికృష్ణ, ఐటీడీపీ భాస్కర్, లింగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పెద్దగుమ్మడాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ముగ్గురు రైతులకు తీవ్ర గాయాలు
- హైవే డివైడర్‌ను దాటి పక్కరోడ్డుపైకి వెళ్లిన బస్సు

పాణ్యం, జనవరి 20 : స్థానిక చందమామ హోటల్ వద్ద శనివారం తెల్లవారుజామున త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ముగ్గురు రైతులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పాణ్యంకు చెందిన రైతులు ట్రాక్టర్‌లో బియ్యం వేసుకొని వెళ్తుండగా నంద్యాల వైపు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సు అతివేగంగా ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తా పడి ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న పాణ్యంకు చెందిన రేవనూరు కలాంఉశేన్, ఇప్పా వెంకటేశ్వర్లు, సిద్దం సుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన పాణ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో బస్సు ట్రాక్టర్‌ను ఢీకొని అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డువైపు వెళ్లి నిలిచిపోయింది అదే సమయంలో అటువైపు వాహనాల రాకపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. ప్రమాదంలో బస్సు తీవ్రంగా దెబ్బతింది. బస్సులోని ప్రయాణికులు స్వల్పగాయాలపాలయ్యారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూటర్న్ ఉన్నా అతివేగమే : ప్రమాదం జరిగిన ప్రదేశంలో యూటర్న్, సిగ్నల్ లైట్లు ఉన్నా బస్సు వేగం తగ్గించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. అలాగే హైవే డివైడర్‌ల మధ్యన చెట్లులేకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాల కాంతివంతమైన లైట్ల వెలుగుతో ఎదురుగా వెళ్తున్న వాహనాలు కనపడకపోవడందో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. హైవే అధికారులు హైవే డివైడర్‌ల మధ్య చెట్లు పెంచాలని కోరుతున్నారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రైతులు

రాయలసీమ సమస్యలపై దీక్ష

- 27న నంద్యాలలో నిజదర్శన దీక్ష

నంద్యాల టౌన్, జనవరి 20: రాయలసీమ సాగునీటి సమస్యల పరిష్కార మార్గాలపై ఈ నెల 27న నిజదర్శన దీక్షను చేపట్టామని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి తెలిపారు. శనివారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ప్రచార కరపత్రాలను సమితి నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వైఎన్ రెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర, కృష్ణా నదులలో నీరు ప్రవహిస్తున్నా.. రాయలసీమకు చట్టబద్ధమైన నీటి హక్కులున్నా ప్రాజెక్టులకు నీరు పొందడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. రాయలసీమలో న్యాయ రాజధాని అంటూ ఒకరు, సీడ్‌హబ్, ఉద్యానవన పంటల హబ్ అంటూ ఇంకోకరు రాయలసీమ వాసులను మభ్యపరచడం ఇకనైనా ఆపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం కల్పించిన హక్కుల సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం, బచావత్ ట్రిబ్యునల్, రాష్ట్ర విభజన చట్టం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు కల్పించిన నీటి హక్కులకు తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 6, 2023న తెచ్చిన చీకటి చట్టం రద్దు కోసం పోరాడాలని సూచించారు. రాయలసీమ అభివృద్ధికి చెరువుల నిర్మాణం, పునరుద్ధరణ, పెన్నానది పునరుజ్జీవనానికి ప్రత్యేక సాగునీటి కమిషన్ ఏర్పాటుకు కృషి చేయాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాయలసీమ సాగునీటి వాస్తవ పరిస్థితికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని రాజకీయ పార్టీలను కోరారు. రాయలసీమ ప్రగతి కోసం చేపట్టే ఈ దీక్షలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి నాయకులు ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఏజీఎం శివనాగిరెడ్డి, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాగునీటి సమితి నాయకులు

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

నంద్యాల (కల్చరల్), జనవరి 20: ఈ నెల 26వ తేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, వేదిక, బ్యాక్‌డ్రాప్, వీఐపీ సీటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, నవరత్నాల అభివృద్ధి కార్యక్రమాలు, వ్యవసాయం, డీఆర్డీఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను, సంక్షేమ శాఖలు అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకొని ఫ్లెక్సీ బ్యానర్లు, కరపత్రాలను కలెక్టర్, ఎస్పీ, జేసీ రవాణా శాఖ అధికారులు ఆవిష్కరించారు.

జిల్లా రైతాంగాన్ని ఆదుకోండి

నంద్యాల (కల్చరల్), జనవరి 20: జిల్లాలో తీవ్ర వర్షాభావ కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని రకాల ఆదుకునేందుకు సమష్టిగా కృషి చేయాలని వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను సూచించారు. వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు.

రేపు 'స్పందన' రద్దు

నంద్యాల (కల్చరల్), జనవరి 20: ఈ నెల 22న నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం అనివార్య కారణాలవల్ల రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

నిపుణుల సేవలను ఉపయోగించుకోవాలి : కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జనవరి 20: ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్ సేవలను ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ ఇన్ గవర్నమెంట్ స్కూల్స్ కార్యక్రమం పై మండల విద్యాధికారులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మూడు ఇంజనీరింగ్ కాలేజీల నుంచి 75 మంది విద్యార్థులను 225 పాఠశాలలకు మ్యాప్ చేసి శిక్షణ ఇస్తారన్నారు. ఒక్కొక్క విద్యార్థికి మూడు పాఠశాలలు కేటాయించి అక్కడ ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలపై అన్నిరకాల సాంకేతిక అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నెలకు రూ.1200 స్టైపండ్ ఇస్తుందని వివరించారు. జాయింట్ డైరక్టర్ మువ్వా రామలింగం, జిల్లా ఉప విద్యాశాఖాధికారి, అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

శోభా యాత్రను జయప్రదం చేయండి

ఆత్మకూరు, జనవరి 20: పట్టణంలో నిర్వహించే శ్రీరాముడి శోభా యాత్రను జయప్రదం చేయాలని పట్టణ పురోహితులు గరుడాద్రి సత్యనారాయణశర్మ, విశ్వహిందూ పరిషత్ ఆత్మకూరు ప్రఖండ అధ్యక్షుడు గరుడాద్రి సుదర్శన్ పిలుపునిచ్చారు. శనివారం ఏకలవ్య నగర్‌లోని సీతారామాలయంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా ఆలయాన్ని శుభ్రం చేశారు. అయోధ్యలో జరిగే బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని 22వ తేదీ సోమవారం ఉదయం 9గంటలకు అయ్యప్పస్వామి ఆలయం నుంచి కేజీ రోడ్డు, గౌడ్‌సెంటర్, పాతబస్టాండ్, నేతాజీనగర్, తోటగేరి, పెద్దబజారు మీదుగా అమ్మవారిశాల వారు మోటారు బైక్‌లతో కూడిన శ్రీరాముడి శోభా యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు మండల పరిధిలోని బాపనంతాపురం గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22న సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.

23న వసంత పంచమి ఏర్పాట్లపై సమీక్ష

కొత్తపల్లి, జనవరి 20: కొలనుభారతి అమ్మవారి వసంతి పంచమి ఏర్పాట్లపై ఆర్డీవో మిరియాల దాస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఈవో మోహన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సరస్వతి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు వచ్చే నెల ఫిబ్రవరి 14న అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో కొలనుభారతి క్షేత్రంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

ముస్లింలకు 25 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి

ఆత్మకూరు, జనవరి 20: రాష్ట్రంలో ముస్లింలకు రాజకీయ పార్టీలు 25 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని ఆత్మకూరు ముస్లిం అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నూర్‌బేగ్ అన్నారు. శనివారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 55నుంచి 60 స్థానాల్లో ముస్లింలు గెలుపును శాసించే స్థాయిలో ఉన్నారని అన్నారు. అయితే కేవలం ఐదారు సీట్లను మాత్రమే రాజకీయ పార్టీలు కేటాయించడం సరికాదని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరురూరల్, జనవరి 20 : కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీవో మోహన్‌కుమార్, బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా అన్నారు. శనివారం నల్లకాలువ, కురుకుంద గ్రామాల్లో మండల అధికారులతో కలిసి వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర పథకాలైన ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన, పోషణ్ అభియాన్, పీఎం ఆవాస్ యోజన తదితర కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్‌కుమార్, వికసిత్ కోఆర్డినేటర్ చంత నగేష్, సర్పంచ్ వెంకటరమణ, కార్యదర్శి బాలునాయక్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనం

శ్రీశైలం, జనవరి 20: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని వడ్డెర కాలనీలో ఓ ద్విచక్ర వాహనం శుక్రవారం రాత్రి మంటల్లో తగలబడిపోయింది. వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న చెల్లా ఆంజనేయులు తన వాహనాన్ని ఇంటి బయట నిలుపగా రాత్రి సమయంలో మంటల్లో తగలబడిపోయిందని గుర్తించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు శ్రీశైలానికి పురందేశ్వరి

శ్రీశైలం, జనవరి 20: రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదివారం శ్రీశైలం రానున్నారు. సోమవారం ఉదయం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకోనున్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని శ్రీశైలం దేవస్థానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న ఎల్ఈడీ స్క్రీన్లలో ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులతో కలిసి వీక్షించనున్నారు.

రామాయణ సూక్ష్మచిత్రాలతో మందిరం



నంద్యాల (కల్చరల్), జనవరి 20: నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అద్భుత చిత్రాన్ని ఆవిష్కరించారు. రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలతో సూక్ష్మచిత్రాలతో అయోధ్య రామమందిరం చిత్రాన్ని వేశారు. ఈ చిత్రాన్ని నీలిరంగులతో చిత్రించారు. ఈ చిత్రంలో శ్రీరాముని జననం నుంచి సీతాదేవి అగ్ని పరీక్ష వరకు సూక్ష్మచిత్రాలు వేశారు. చిత్రకారుడు కోటేష్ మాట్లాడుతూ దాదాపు 500 సంవత్సరాల నుంచి అయోధ్య కోసం పోరాటం జరుగుతోందని, హిందూ మత ఆరాధ్య దైవం శ్రీరాముడి ఆలయం చూడాలని కోట్లాది మంది భక్తులువేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.

హైవేపై వాహనాల నిలిపివేతతో ప్రమాదాలు

పాణ్యం, జనవరి 20 : మండలంలోని జాతీయ రహదారిపై వాహనాలు నిలిపుతుండడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఏర్పడింది. జాతీయ రహదారిపై ఉండే స్టేజీల వద్ద ప్రత్యేకంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసినా వాహనాలు సర్వీసు రోడ్లపై వెళ్లకపోవడంతో ప్రయాణికులు రోడ్డు దాటే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అతివేగంగా వెళ్లే వాహనాలకు ఈ నిలిచిన వాహనాలు అడ్డంకిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు సర్వీసు రోడ్లపై వెళ్లకపోవడంతో పాటు ప్రయాణికులను జాతీయ రహదారి పైనే దింపుతూ ఎక్కించుకుంటూ రహదారి నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

చెక్ పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు

నంద్యాల క్రైం, జనవరి 20 : నంద్యాల జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, సెబ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకం, అక్రమ రవాణా, నాటుసారా స్థావరాలు, వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వీటిలో సెబ్ అధికారులు 12 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేసి వారి వద్ద 91 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, 600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శిరివెళ్ల పరిధిలో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 165 సంచుల రేషన్ బియ్యం, ఓ వాహనాన్ని సీజ్ చేశామని అన్నారు. మహానంది స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్: టీడీపీ


వెంకటాపురంలో మేనిఫెస్టో గురించి వివరిస్తున్న అఖిలప్రియ


బనగానపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ


డి.వనిపెంటలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకుడు

శిరివెళ్ల, జనవరి 20: అన్నపూర్ణగా వెలుగొందిన రాష్ట్రాన్ని జగన్ పాలన నేడు అప్పుల ఆంధ్రప్రదేశ్‌లా మార్చారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలుగా పనికిరారని సీఎం జగనే నిర్ణయించారని.. ఆ స్థాయిలో ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోందని అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, ఆరికట్ల రమణారెడ్డి, బత్తిన వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, జ్యోతి, కమతం జయరామిరెడ్డి, కమతం పుల్లారెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, కుందూరు మోహన్‌రెడ్డి, పీపీ లింగమయ్య, మహమ్మద్ హుసేన్, బాలచంద్రుడు, నాలి వలి, సూరా శ్రీనివాసులు, బీఎండీ ఫరూక్, అబూబకర్ సిద్ధిఖ్, వెంకట సుబ్బయ్య, భాస్కర్, భూమా వేణుగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రుద్రవరం: మండల కేంద్రమైన బెస్తకాలనీకి చెందిన హెచ్ఎం నరసింహ మాతృమూర్తి పెద్ద మద్దమ్మ (75) మృతి చెందారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ రుద్రవరం చేరుకుని పెద్ద మద్దమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల కన్వీనరు రంగనాయకులు, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, చిన్నిక్రిష్ణ, ఫక్కీరయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

చాగలమర్రి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని డి.వనిపెంట టీడీపీ గ్రామ కన్వీనర్ గోపాల్ అన్నారు. శనివారం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో అర్హులైన పేదలందరికీ 2 సెంట్ల స్థలం ఇచ్చి పేద ప్రజల రుణం తీర్చుకుంటామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని పెద్దపీర్ల చావిడి వీధిలో బీసీ ఇందిరమ్మ పర్యటించారు. పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి వారికి న్యాయం చేస్తామన్నారు. తాము వైసీపీ నాయకుల మాదిరి కల్లబొల్లి మాటలు, అబద్దాలు ఆడాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి చెప్పడం ఖాయమన్నారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక


టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 20: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం 25 కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో స్వచ్ఛందంగా టీడీపీలో చేరాయి. శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ పథకంలో భాగంగా వెంకటాపురంలో పర్యటనలో కె.రామకృష్ణతో పాటు 25కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కట్టి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మరో రెండు నెలల్లో అరాచక పాలనకు అంతం తప్పదన్నారు. ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రజల సొమ్మును అప్పనంగా దోచేస్తున్న వైసీపీ నాయకులను గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో అమర్‌నాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దళితులపై జగన్ కపట ప్రేమ'


డోన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

డోన్, జనవరి 20: సీఎం జగన్ ఎన్నికల ముందు దళితులపై కపట ప్రేమను చూపిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయి రక్షణ లేకుండా పోయిందన్నారు. దళితుడైన కోడికత్తి శ్రీనును ఐదేళ్ల నుంచి జైలులోనే ఉంచడం దారుణమన్నారు. దళితులకు వైసీపీ పాలనలో ఒరిగిందేమీ లేదని, చంద్రబాబు అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేశారని మండిపడ్డారు. గంధం శ్రీనివాసులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం పేరుతో హడావుడి చేసినంత మాత్రానా వైసీపీని దళితులు నమ్మే పరిస్థితి లేదన్నారు. వైసీపికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉంగరానిగుండ్ల రాముడు, సిటీకేబుల్ కిరణ్, కొచ్చెర్వు రామచంద్రుడు, గంధం చరణ్, వీరాంజి, మురళి, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు: మంత్రి


డోన్‌లో ఐటీఐ హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

డోన్, జనవరి 20: విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకున్నప్పుడే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్మించిన నూతన వసతి భవనాన్ని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి బుగ్గన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన డోన్‌లో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా ఈ నెల 29న గోరుకల్లు రిజర్వాయరు నుంచి బేతంచెర్లకు తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డోన్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం

డోన్(రూరల్), జనవరి 20: డోన్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఆర్టీవో క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధే ధ్యేయం'

శిరివెళ్ల, జనవరి 20: గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని జలవనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గోవిందపల్లె, కామినేనిపల్లె గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులు, విద్యుత్ లైన్లు, ఘన వ్యర్థ పదార్థాల నిల్వ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. వైసీపీ మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, కామినేనిపల్లె గ్రామ సర్పంచ్ మేరువ చిన్న నరసింహారెడ్డి, అబ్దుల్ సలాం, నజీర్, నర్ల రాజశేఖరరెడ్డి, మండాల శివారెడ్డి, ఇందూరి శేషారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'వెదుర్ల సేకరణకు చర్యలు'

రుద్రవరం, జనవరి 20: రుద్రవరం కలప డిపో పరిధిలో 1,78,116 వెదుర్ల సేకరణ లక్ష్యం ఉందని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నట్లు రేంజర్ శ్రీపతినాయుడు శనివారం తెలిపారు. బీసీ-2 వెదురుకూపుల్లో సేకరణ చేయాల్సి ఉందన్నారు. గొర్రెగుంత, మామిడి మాను చెలిమ, పిల్లమానుపెంట, అహోబిళం వెదురు కూపుల్లో వెదురు సేకరణ ప్రారంభించడం జరిగిందని రేంజర్ తెలిపారు. నెలలో రెండుసార్లు వెదురు వేలాలు ఉంటాయని తెలిపారు.

GENERAL NOTICE

అందరికీ తెలియపరుచడం ఏమనగా మా క్లయింటు Shriram Finance Ltd. Dhone Branch వారు ఈ క్రింద తెలుపబడిన షెడ్యూలు Property ని Mortgage చేసుకొని **Balija Srinivasulu, S/o. B.Ramesh, R/o Sweepers, Dhone** అను వారికి లోన్ ఇవ్వదలచినారు. కావున ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలో తెలుపవలెను.

SCHEDULE OF THE PROPERTY

Some portion site in plot no 31 situated Nandyala Registration district, Dhone Sub Registrarion district, in survey bearing no 285, in 10th ward, Sweepers Colony, near Ayyappa Swamy temple residential area, near house bearing no 10-118-120-10, Dhone town and mandal, Nandyal District.

Measurements : East-West: : 18 feet, North-South: 36 feet, Total: **72** Square Yards.

Boundaries : East : plot no 32 belongs to Kadiyala Srinivasulu, **West** : 24 feet vide Road, **North** : 20 feet vide Road, **South** : remaining site in plots no 31,32 belongs to othuru Thimmiah.

G.Madhusudhan Rao,
Advocate, Dhone, Kurnool.

'కులగణన సర్వేను సక్రమంగా చేపట్టాలి'

రుద్రవరం, జనవరి 20: మండలంలో కులగణన సర్వేను సక్రమంగా చేయాలని గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఎంపీడీవో ఆదేశించారు. శనివారం రుద్రవరంలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేలో నిర్లక్ష్యం చేస్తే బాధ్యత వారిదేనన్నారు. ప్రతి గ్రామంలో కులగణన సర్వే చేయాలని అన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

డోన్(రూరల్), జనవరి 20: అనాథ శవానికి ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షులు షాధిఖానా రాజా ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. డోన్ మండలం చిన్నమల్కా పురం గ్రామ సమీపంలో గుర్తు తెలియని యాచకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. రూరల్ పోలీసులు ఆ మృతదేహానికి పోస్టుమార్టం చేసి ద్రోణచలం సేవా సమితి సభ్యుల సహకారం తీసుకున్నారు. సేవా సమితి సభ్యులు డోన్ పట్టణ సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. సభ్యులు పానిపూరి మురళి, మస్తాన్, జవహర్ బాషా, బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బలిజల సత్తా చూపుదాం'

ఆళ్లగడ్డ, జనవరి 20: వచ్చే ఎన్నికల్లో బలిజల సత్తా చూపుదామని ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి విజయకుమార్ పిలుపునిచ్చారు. అహోబిలంలోని సుమంత కాంప్లెక్స్‌లో శనివారం బలిజ మహా సంకల్ప రాజ్యాధికార సన్నాహక ఆత్మీయ సమావేశం జరిగింది. బలిజలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య అన్ని రంగాల్లో ఎదిగేందుకు తీసుకోవాల్సిన ప్రణాళికలు, చర్యలపై సమావేశంలో చర్చించారు. వచ్చే ఎన్నికల్లో బలిజలకు ఎమ్మెల్యే, ఎంపి టికెట్స్ కేటాయించే పార్టీలకు సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పసుపులేటి వెంకటేశ్వర్లు, టీడీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గూడురు సంజీవరాయుడు, కోనేటి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎంవీ ప్రసాద్, కొల్లం పుల్లయ్య, బలిజ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

'పారిశుధ్యం లోపించకుండా చర్యలు'

రుద్రవరం, జనవరి 20: మండలంలో 21 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్యం లోపించకుండా, నరసింహస్వామి పార్వేట ఉత్సవాలు జరిగే గ్రామాల్లో కూడా చర్యలు చేపట్టాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ శనివారం అన్నారు. పార్వేట ఉత్సవ గ్రామాల తో పాటు మిగిలిన గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బహిరంగ మల విసర్జన చేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలన్నారు. ఆయా గ్రామాల్లోని వాటర్‌ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని ఆదేశించారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించాలి'

చాగలమర్రి, జనవరి 20: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. శనివారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు గ్రామాల పురోగతని వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రూ.3.40 కోట్లు మంజూరయ్యాయని, అందులో రూ.2.80 కోట్లతో వివిధ పనులు చేశామని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌బీకేలలో జొన్నలు కొనుగోలు చేసే విషయంలో నాణ్యతకు సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. మండల ఉపాధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, ఎంపీడీవో మహబూబ్‌దౌలా, ఏవో రంగనేతాజీ, హెచ్‌వో నరేష్‌కుమార్‌రెడ్డి, ఏఈలు కొండారెడ్డి, షాజహాన్, జగ్గయ్య, పశువైద్యాధి కారి సాయిబాబా, ఏపీవో నిర్మల, ఎంఈవో న్యామతుల్ల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉద్యాన పంటల సాగు లాభదాయకం'

చాగలమర్రి, జనవరి 20: ఉద్యాన పంటల సాగు లాభదాయకమని ఉద్యానశాఖ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద శాతం సబ్సిడీతో ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. మామిడి, చినీ, సపోటా తదితర పండ్ల తోటల సాగుకు మొక్కలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పండ్ల తోటలు సాగు చేసిన రైతులు ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. గాలి, వాన భీభత్సం వల్ల నష్టం జరిగినప్పుడు రైతులకు నష్టపరిహారం అందించేందుకు వీలు ఉంటుందని అన్నారు.

కర్నూలుకు తరలిన వాల్మీకులు

బేతంచెర్ల, జనవరి 20: కర్నూలులో జరిగే వాల్మీకి మహాసభకు బేతంచెర్ల నుంచి వాహనాల్లో వాల్మీకులు తరలివెళ్లారు. శనివారం రైల్వేస్టేషన్ ప్రాంగణం నుంచి వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడు పుట్టపాశం వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు బుక్కాపురం సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు మద్దయ్య, కొత్తపల్లె వాల్మీకి సంఘం అధ్యక్షులు మాధవకృష్ణ, విజయ్, రామకృష్ణ, నాగేశ్వరరావు, మద్దిలేటి, రాజశేఖర్, రామారావు, అధిక సంఖ్యలో వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

బనగానపల్లె, జనవరి 20 పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్షలు ఆదివారం పగడ్బందీగా నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షల్లో 177 మందికి గానూ 153 మంది విద్యార్థులు హాజరు కాగా 24 మంది గైర్హాజరైనట్లు హెచ్ఎం .బాల గంగాధర్‌రెడ్డి తెలిపారు. అలాగే బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మరో నవోదయ పరీక్షా కేంద్రంలో 192 మంది విద్యార్థులకు గానూ 168 మంది హాజరయ్యారని హెచ్ఎం రామకృష్ణ తెలిపారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరిగిన నవోదయ పరీక్షకు 322 మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల హెచ్ఎం రాజయ్య, పరీక్ష చీఫ్ బసవరాజులు తెలిపారు. శనివారం నిర్వహించిన పరీక్షలకు సంబంధించి వారు మాట్లాడుతూ ఉదయం 11.30 గంటలనుంచి 2 గంటల వరకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.57 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

'భాగస్వాములు కండి'

రుద్రవరం, జనవరి 20: గ్రామ పంచాయతీల అభివృద్ధికి పొదుపు సంఘాల మహిళలు భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం రుద్రవరం మండల సమావేశ భవనంలో సమీక్ష నిర్వహించారు. పొదుపు మహిళల సమీక్షలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో తమ వంతు సహకరించాలని కోరారు. 2024-25 ఆర్థిక సంఘంలో అభివృద్ధి ప్రణాళికలో భాగస్వామ్యమై అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల వీవోఏలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మౌనదీక్ష


దొర్నిపాడులో మౌన దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మౌనదీక్ష, రాస్తారోకో, మానవహారం చేపట్టారు. వారు మాట్లాడుతూ డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె ఆగదని స్పష్టం చేశారు. సమ్మెకు వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.
- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


రుద్రవరంలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు


సంజామలలో..


బనగానపల్లెలో..


బేతంచెర్లలో రాస్తారోకో


ఆళ్లగడ్డలో..


చాగలమర్రిలో మానవహారం


డోన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో..


డోన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

అహోబిలంలో సుందరకాండ పారాయణం


సుందరకాండ పారాయణం చేస్తున్న వేద పండితులు

ఆళ్లగడ్డ, జనవరి 20: అయోధ్యలో భవ్య రామ మందిర ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో శనివారం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వేదపండితులు సంక్షిప్త సుందరకాండ పారాయణం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వేదపండితులు పాల్గొని రామాయణంలోని సుందరకాండ శ్లోకాలు చదివారు.

పూజలందుకున్న అహోబిలేశుడు

ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామానికి శనివారం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ చేరుకుంది. గ్రామంలోని పెద్దదేవాలయం తెలుపు వద్ద పల్లకి విడిది చేయడంతో ఆయా ప్రాంతాలలోని ప్రజలు మేళతాళాలతో వెళ్లి భక్తి, శ్రద్ధలతో పూజలు చేశారు. మర్రిపల్లె గ్రామంలో ఆదివారం పూజలందుకోనున్నారు.

యర్రగుంట్లలో శోభయాత్ర

శిరివెళ్ల, జనవరి 20: మండలంలోని యర్రగుంట్ల రామాలయం నుంచి పురవీధుల గుండా శనివారం బైక్‌లతో శోభ యాత్ర నిర్వహించారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను చూసి ప్రతి హిందువు తరించాలని శ్రీరామ సేన కమిటీ ప్రతినిధులు అన్నారు. సనాతన, హిందూ ధర్మ ఔన్నత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం నగర సంకీర్తన, బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ప్రజలు వీక్షించేందుకు రామాలయ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీరామ సేన కమిటీ ప్రతినిధులు, పలువురు యువకులు పాల్గొన్నారు.

రేపు బేతంచెర్లలో..

బేతంచెర్ల: అయోధ్యలో రామాలయ ప్రారంభం 22వ తేదీన శ్రీరామ శోభాయాత్ర సందర్భంగా బేతంచెర్ల పట్టణంలో నిర్వహించే శోభయాత్రను విజయవంతం చేయాలని గౌరి హుశేన్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఆంజనేయస్వామి దేవాలయంలో శోభయాత్ర కర పత్రాలను విడుదల చేశారు. శోభాయాత్ర ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి బయలుదేరుతుందని చెప్పారు.

'గోసంరక్షణతో సకల సంపదలు'

చాగలమర్రి, జనవరి 20: గోజాతి సంరక్షణ వల్ల సకల సంపదలు చేకూరుతాయని, నేల సారవంతమై ప్రకృతి పులకరిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలుజిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లూ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మద్దూరు గ్రామంలోగల స్వయంభు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ, కంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాసు చేసిన శ్రీరామాయణ, మహాభారత భగవద్గీతపై ధార్మిక ప్రవచనాలు, భజన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఆలయానికి రూ.4.26 లక్షల ఆదాయం

బేతంచెర్ల, జనవరి 20: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.4.26 లక్షలు సమకూరినట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రరావు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.4,26,681 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కర్నూలు నగరానికి చెందిన ఆలవాల బాలయ్య, లక్ష్మీదేవమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు మురళి మోహన్ రూ.1,00,101 నగదును అందజేసినట్లు వారు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 20: మండలంలోని వాసాపురం వెంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి అమ్మవారికి అర్చకులు వారణాసి గోపిశర్మ శనివారం అభిషేకం చేసి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరలివచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

మానస లింగేశ్వరస్వామికి..

వాసాపురంలో కొలువుదీరిన మానసలింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకుడు శివశర్మ వేద మంత్రోచ్చరణల మధ్య అభిషేకం చేసి పూజలుప్రారంభించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఉప అల్పాహారం ఏర్పాటు చేశారు.

నరసింహస్వామికి..

నరసాపురం, రుద్రవరం నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సీతారాములకు..

చాగలమర్రి, జనవరి 20: చాగలమర్రిలోని పట్టాభిరామ, కోదండ రామ ఆలయాల్లో శనివారం సీతారాములు, వీరాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు మెట్ల మార్గం ప్రారంభం

డోన్(రూరల్), జనవరి 20: డోన్ పట్టణం తిరుమల ఆంజనేయ స్వామి కొండపై ఈ నెల 22న మెట్లమార్గం ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీతారామ కల్యాణ మండప నిర్మాణ నిర్వాహకులు, మాణిక్య ప్రభు సేవా సమితి సభ్యులు తెలిపారు. అయోధ్యల శ్రీరాముల ప్రాణ ప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.